సాక్షి
శ్రీకాకుళం
గురువారం । 23 । మార్చి । 2023



సేంద్రియ సాగు.. భలే బాగు

కూరగాయలు, పండ్ల తోటల పెంపకంలో ఓ రైతు ఆదర్శంగానిలుస్తున్నారు. విభిన్న పద్ధతులు పాటిస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నారు. - 8లో



గెస్ట్‌హౌస్‌లో చోరీ

వెంకటాపురంలోని వ్యవసాయ పొలం వద్ద ఉన్న గెస్ట్‌హౌస్‌లో చోరీ జరిగింది. రూ.2 లక్షల నగదు, టీవీని దుండగులు పట్టుకుపోయారు. - 8లో

27న 104 వాహనాల ప్రారంభోత్సవం

అరసవల్లి: ఫ్యామిలీ డాక్టర్ విధానం అమల్లో భాగంగా జిల్లాకు కేటాయించిన 25 సంచార 104 వాహనాల ప్రారంభోత్సవం తాత్కాలికంగా వాయిదా పడింది. వాస్తవానికి ఉగాది నాడే ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం భావించినా వివిధ కారణాలతో ఈ నెల 27న ప్రారంభించేందుకు నిర్ణయించారు. ఈ మేరకు ఉన్నతాధికారుల నుంచి సమాచారం అందిందని డీఎంహెచ్ఓ డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తెలిపారు.

న్యూస్‌రీల్

ఏరువాక సాగారో..!



ఉగాది పర్వదినాన ఏరువాక నిర్వహించడం ఆనవాయితీ. దీనిలో భాగంగా బుధవారం పలాస మండలం పూర్ణబద్ర గ్రామంలో రైతన్నలు దుక్కి దున్ని భూదేవికి ప్రత్యేక పూజలు చేశారు. తరతరాలుగా వస్తున్న ఆచార సంప్రదాయాన్ని కొనసాగించారు. – కాశీబుగ్గ

చెట్టు పొట్టిది.. కాపు గట్టిది



సరుబుజ్జిలి మండలం పెద్దపాలెం గ్రామ సమీపంలోని దంతపురి క్షేత్రంలో భ్రమరాంబికా సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో ఓ కొబ్బరి చెట్టు అబ్బురపరుస్తోంది. కేవలం 2 అడుగుల ఎత్తులోనే కొబ్బరి బొండాలను విరగకాస్తోంది. -సరుబుజ్జిలి

4 అడుగుల పొడవు.. 5 వందల కాయలు



సాధారణంగా అరటి గెల రెండు మూడు అడుగుల పొడవు పెరిగి రెండు వందల వరకు కాయలు కాస్తుంది. జి.సిగడాం మండలం సంతవురిటి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, ధర్మాన రాములు కొనుగోలు చేసిన ఈ అరటి గెల మాత్రం నాలుగు అడుగుల పొడవుతో సుమారు ఐదు వందల కాయలు కాసి కనువిందు చేస్తోంది. – జి.సిగడాం

అష్టఫలాలతో అలంకరణ



జిల్లా కేంద్రంలోని నానుబాలవీధిలో విజయదుర్గా అమ్మవారిని బుధవారం అష్టఫలాలతో అలంకరించారు. అర్చకులు ఆరవెల్లి సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలోఅమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి పాదాలను సూర్యకిరణాలు తాకిన దృశ్యాన్ని చూసేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. – శ్రీకాకుళం కల్చరల్

నేడు ఎల్ఎల్‌బీ, స్పెషల్ బీఎడ్ స్పాట్ అడ్మిషన్లు

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో గురువారం మూడేళ్ల న్యాయ విద్య (ఎల్ఎల్‌బీ), స్పెషల్ బీఎడ్ మెంటల్లీ రిటార్డులో స్పాట్ అడ్మిషన్లు (తక్షణ ప్రవేశాలు) నిర్వహించనున్నారు. న్యాయ కళాశాల, ఎడ్యుకేషన్ విభాగంలో దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఎల్ఎల్‌బీ మూడేళ్ల లా ప్రవేశాలకు లాసెట్ -2022 అర్హత, బీఎడ్ ప్రవేశాలకు ఎడ్‌సెట్ -2022 అర్హత ఉండాలి.

శోభకృతం.. శుభప్రదం

- కొత్త సంవత్సరాదికి సిక్కోలు వాసుల ఘన స్వాగతం

శోభకృత్ నామసంవత్సర ఉగాది పర్వదిన వేడుకలను బుధవారం జిల్లా ప్రజలు ఆనందోత్సాహాలతో జరుపుకొన్నారు. నూతన వస్త్రాలు ధరించి ప్రధాన ఆలయాల్లో నిర్వహించిన పంచాంగ శ్రవణంలో పాల్గొన్నారు. మామిడి తోరణాలతో గృహ సముదాయాలు కళకళలాడాయి. బంగారం కొనుగోలు చేసేందుకు మక్కువ చూపారు. భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి.



నరసన్నపేటలోని దేశవానిపేట బీసీ బాలికల వసతి గృహంలో ఉగాది వేడుకలు



ఆదిత్యుని ఆదాయం 14 వ్యయం 11

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉగాది ఆస్థాన కార్యక్రమంలో కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ పాల్గొన్నారు. జిల్లా ప్రజలందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. అనివెట్టి మండపంలో నిర్వహించిన ఆస్థానంలో ఆలయ ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ, సాంస్కృత వేద పండితులు భాస్కరభట్ల నర్సయ్య శర్మ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిగింది. స్వామి వారి నక్షత్రం విశాఖ అని, తులారాశిలో జన్మించారని చెప్పారు. ఈ ఏడాది ఆదాయం 14, వ్యయం 11, రాజ్యపూజ్యం 7గా ఉందని వివరించారు. ఆలయ ఆదాయం ఈ ఏడాది భారీగా పెరిగే సూచనలున్నాయని వివరించారు. సర్వజనులకు ఆరోగ్య ఫలాలు సంతృప్తికరంగా ఉంటాయని వివరించారు.

ప్రముఖులకు నిజరూప విగ్రహ నమూనాలు..

ఎంతో చరిత్ర గలిగిన సిక్కోలుకు ప్రధాన గుర్తింపు అరసవల్లి క్షేత్రమేనని.. ఆదిత్యుని చిత్రపటాలనే ప్రముఖులకు జిల్లా తరఫున జ్ఞాపికలుగా అందిస్తున్నామని, ఇకపై విశిష్ట ప్రముఖులకు స్వామి నిజరూప విగ్రహ నమూనానే జ్ఞాపికగా ఇచ్చేందుకు నిర్ణయించి, స్థానిక శిల్పి, పోలీసుగా విధులు నిర్వరిస్తున్న దివిలి హేమచంద్రకు బాధ్యతను అప్పగించానని కలెక్టర్ ప్రకటించారు. అనంతరం నిజరూప జ్ఞాపికను ఆలయ ప్రాంగణంలో ఆవిష్కరించారు. స్వామి జ్ఞాపికను తయారు చేసే అవకాశం దక్కడం అదృష్టంగా భావిస్తున్నానని, తన తండ్రి, శిల్పి దివిలి అప్పారావే తన గురువు అని తెలియజేశారు.



రాశి ఫలాలు వింటున్న కలెక్టర్ తదితరులు

పండితులకు పురస్కారాలు..

ఉగాది సందర్భంగా జిల్లా దేవదాయ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న వివిధ ఆలయాల పండితులకు ఉగాది పురస్కారాలను కలెక్టర్ అందజేశారు. అర్చకులు బొంతకోటి కృష్ణారావు, తిరుమల చంద్రశేఖరరావు, వేదపండితులు దర్భముళ్ల శ్రీనివాసశర్మలకు పురస్కారాలు, వస్త్రాలు, నగదు పారితోషికాన్ని గౌరవంగా అందజేశారు. అరసవల్లి ఆలయ అర్చకులు ఇప్పిలి రంజిత్ శర్మ, ఇప్పిలి సాందీప్ శర్మ, నేతేటి హరిప్రసాద్ శర్మ, సూర్యనమస్కార పండితులు దర్భముళ్ల రామకృష్ణ శర్మ, శ్రీధర్ శర్మ, వేద పండితులు శ్రీనివాస్ శర్మ, పార్థసారధి, వికాస్ శర్మ తదితరులను కూడా ఉగాది పురస్కారాలతో కలెక్టర్ సత్కరించారు.

అందరికీ శుభం కలగాలి

శ్రీకాకుళం కల్చరల్: తెలుగు వారి సంస్కృతులకు వారధి ఉగాది పండగని, ఈ ఏడాది ఆనందకర అభివృద్ధి జరగాలని జాయింట్ కలెక్టర్ మల్లారపు నవీన్ ఆకాంక్షించారు. జిల్లా కేంద్రంలోని బాపూజీ కళామందిర్‌లో రాష్ట్ర ప్రభుత్వ పర్యాటక, యువజన సర్వీసుల శాఖ, మెప్మా సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. ముందుగా జ్యోతిష పండితులు ధర్మపురి గౌరీశంకర శాస్త్రి పంచాంగ పఠనం చేశారు. అనంతరం తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను జేసీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ప్రముఖులతో పాటు అధికారులు పాల్గొన్నారు.



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న జేసీ తదితరులు

కూర్మనాథాలయంలో..



పంచాంగ శ్రవణం నిర్వహిస్తున్న అర్చకులు

గార: ఉగాది పురస్కరించుకుని శ్రీకూర్మనాథాలయం అనివెట్టి మండపంలో దేవతామూర్తులను కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకులు చామర్తి సీతారామనృసింహాచార్యులు శోభకృత్ నామ సంవత్సర రాశి ఫలాలు, కంద ఫలాలు, వర్షాలు, గ్రహణాలు, పండగలు, పుష్కరాల వివరాలు తెలియజేశారు.

వాసుదేవుని సన్నిధిలో..



పంచాంగ ఫలాలు వివరిస్తున్న త్రిదండి అహోబిలరామానుజ జీయర్‌స్వామి

మందస: మందస పట్టణంలోని వాసుదేవ స్వామి ఆలయంలో ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి ఆధ్వర్యంలో తీర్థగోష్ఠి జరిపిన అనంతరం స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. సుందరాకాండ పారాయణం, పంచాంగ శ్రవణం గావించారు.



బంగారం కొనుగోలు చేస్తున్న మహిళలు

ట్రాకింగ్ సిస్టం.. నేరగాళ్లకు కళ్లెం

నేరాలకు పాల్పడేవారు కొత్త కొత్త ఎత్తులతో పోలీసులకు సవాల్ చేస్తుంటారు. మస్కా కొట్టి తప్పించుకునేందుకు ప్రయత్నిస్తుంటారు. కొందరు నేరం చేసిన వెంటనే వేరే రాష్ట్రాలకు పారిపోయి కొన్నాళ్లు తలదాచుకుంటారు. తర్వాత తిరిగ్గా వచ్చి మళ్లీ నేరాలకు పాల్పడుతుంటారు. ఇంకొందరు మారువేషాల్లో మనముందే దర్జాగా తిరుగుతుంటారు. అయితే నేరగాళ్ల ఆట కట్టించేందుకు పోలీసు శాఖ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తుంది. పాత నేరస్తుల వేలిముద్రలు, ఇతర వివరాలను డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేసే పాపిలాన్ సిస్టమ్ నేరగాళ్ల ఆట కట్టించడంలో జిల్లా పోలీసులకు అండగా నిలుస్తోంది.



కాశీబుగ్గ మూడు రోడ్ల కూడలిలో అర్ధరాత్రి వేలిముద్రలు పరిశీలిస్తున్న పోలీసులు

- వేలిముద్రల సాయంతో పాత నేరస్తుల గుర్తింపు
- ఏ రూపంలో ఎక్కడున్నా పట్టేయవచ్చు
- సత్ఫలితాలు సాధిస్తున్న జిల్లా పోలీసులు

కాశీబుగ్గ: కొందరు దొంగలు మనముందే దర్జాగా తిరుగుతారు. ఏమాత్రం అనుమానం రాకుండా పని పూర్తి చేసేస్తారు. పోలీసులు సైతం వీరి కదలికలు గుర్తించలేక సతమతమవుతుంటారు. అయితే ఇదంతా గతం. ఇప్పుడు సరికొత్త సాఫ్ట్‌వేర్ వచ్చేసింది. పాత నేరస్తులను గుర్తించేందుకు పాపిలాన్ సిస్టం పేరుతో నూతన సాఫ్ట్‌వేర్‌ను జిల్లా పోలీసుశాఖ వినియోగిస్తోంది. జీఆర్‌పీ పోలీసులు సైతం రైల్వేస్టేషన్లలో వినియోగిస్తూ పాత నేరస్తుల పని పడుతున్నారు. ఎంతటి కరుడుగట్టిన నేరస్తుడైనా, దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికి వెళ్లి వేషధారణ మార్చి తలదాచుకున్నా ఒక్క వేలిముద్రతో పుట్టుపూర్వోత్తరాలన్నీ తెలుసుకుంటూ కటకటాల వెనక్కి పంపిస్తున్నారు.

ఎక్కడ దాక్కున్నా..



జీఆర్‌పీ పోలీసులు వాడుతున్న ట్రాకింగ్ స్కానర్, మొబైల్

ఆధార్, బ్యాంకింగ్, డిజిటల్ వస్తువుల వాడకం ఇలా ఒక టేమిటి అన్నింటా వేలిముద్రలు నిక్షిప్తం చేయడం వాడుకలోకి వచ్చింది. ఇదే తరహాలో క్రిమినల్ కేసుల్లో పట్టుబడిన ముద్దాయిల వేలిముద్రలు పోలీసులు సేకరించి సాఫ్ట్‌వేర్‌లో పొందుపరుస్తున్నారు. కొన్ని నెలలు గడిచాక విడుదలైనా, పరారైనా, వేషధారణ మార్చి దేశంలో ఏ ప్రాంతానికి వెళ్లినా వేలిముద్రల సాయంతో పట్టుబడుతున్నారు.

తగ్గిన దొంగతనాలు..

జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయం, సైబర్ టీం కలిసి ఇందులో పనిచేస్తున్నారు. పోలీసు ఐటీకోర్ డిపార్ట్‌మెంట్ సైతం నిరంతరం నిఘాలో ఉంటూ జిల్లాలో ఏ స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైనా దానిని ఆన్‌లైన్ చేయగానే అనుసంధానం చేస్తుంటారు. రాత్రి 11 గంటల దాటిన వెంటనే జిల్లాలోని 34 పోలీసు స్టేషన్‌లు, శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం వంటి సర్కిల్లో సైతం అనుమానితులు, రాత్రి వేళ సంచరించేవారి వేలిముద్రలను తనిఖీ చేస్తున్నారు. దీంతో నేరస్తుల కదలికలు బాగా తగ్గాయని పోలీసు అధికారులు చెబుతున్నారు.

విశాఖ నుంచి ఇచ్ఛాపురం వరకు..

జిల్లా పోలీసు యంత్రాంగమే కాకుండా విశాఖపట్నం జీఆర్‌పీ పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లోని రైల్వేస్టేషన్‌లలో జీఆర్‌పీ పోలీసు స్టేషన్‌లలో సైతం ట్రాకింగ్ సిస్టం అమలవుతోంది. రాత్రి వేళ గుర్తింపు కార్డులు లేకున్నా, అనుమానాస్పదంగా తిరుగుతున్నా వేలిముద్రలు తీసుకుని రైల్లోనే అరెస్టు చేసి గార్డు గదిలోని సెల్‌లో ఉంచతున్నారు. అనంతరం జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ ఆధ్వర్యంలో విశాఖపట్నం రైల్వే కోర్టుకు తరలిస్తున్నారు. జిల్లాలోని ఇచ్ఛాపురం, సొంపేట, మందస, పలాస, పూండి, నౌపడ, కోటబొమ్మాళి, తిలారు, శ్రీకాకుళం రోడ్డు, పొందూరు, దూసి వంటి రైల్వేస్టేషన్‌లలో నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు.



పలాస రైల్వేస్టేషన్‌లో ప్రయాణికుడి వేలిముద్రలు పరిశీలిస్తున్న లైన్స్ ఇన్‌స్పెక్టర్

ఏమిటీ సిస్టం..



- ప్రపంచంలో ప్రఖ్యాత బయోమెట్రిక్ సేవలు అందించే నాలుగు అతిపెద్ద కంపెనీలలో పాపిలాన్ ట్రాకింగ్ సిస్టం ఒకటి.
- ఇందులో క్రిమినల్ కేసులకు సంబంధించి ప్రతి వ్యక్తి నేర పూరిత వివరాలు డిజిటల్ రూపంలో నిక్షిప్తం చేయబడి ఉంటాయి.
- ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 43 దేశాలలో పటిష్టమైన భద్రతతో అనుసంధానమై ఉంది.
- ఎఫ్‌బీఐ అండ్ ఇంటర్‌పోల్ సర్టిఫికెట్, లైసెన్సు పొందిన ఈ సిస్టం పాత నేరస్తుల గుండెల్లో గుబులు పుట్టిస్తోంది.
- మన దేశంలో ఒకే దేశం ఒకే ఎఫ్ఐఆర్ పేరుతో అన్ని పోలీసు స్టేషన్‌లకు అనుసంధానం చేశారు.
- దేశంలో ఏ రాష్ట్రంలో నేరం చేసి ఎఫ్ఐఆర్ నమోదైతే సదరు వ్యక్తి ఎక్కడ దాక్కున్నా తనిఖీలలో భాగంగా అనుమానిత వ్యక్తుల వేలిముద్రలతో సులభంగా పట్టేస్తున్నారు.

వేలిముద్రలు సేకరిస్తున్నాం..



ఎస్పీ రాధిక ఆదేశాల మేరకు రాత్రి 11 గంటల తర్వాత అనుమానంగా సంచరిస్తున్నవారి వేలిముద్రలు సేకరిస్తున్నాం. పాత నేరస్తుడైతే వెంటనే అరెస్టు చేసి స్టేషన్‌కు తరలిస్తున్నాం. కాశీబుగ్గ పోలీసు డివిజన్ పరిధిలో చాలావరకు దొంగతనాలు ఓ కొలిక్కివచ్చాయి. ఈ ట్రాకింగ్ సిస్టంతో సత్ఫలితాలు వస్తున్నాయి.

– గుగ్గిలాల శ్రీనివాసరావు,సీఐ, కాశీబుగ్గ

కట్టడి చేస్తున్నాం..



అన్ని రైల్వేస్టేషన్‌లలో సీసీ కెమెరాలు ఏర్పాటయ్యాయి. వాటిని పరిశీలించి అనుమానితుల వేలిముద్రలు సేకరించి వారిని రిమాండ్‌కు తరలిస్తున్నాం. ఈ విషయంలో ట్రాకింగ్ సిస్టం ఎంతగానో ఉపయోగపడుతోంది.

– కె.వెంకటరావు, లైన్స్ ఇన్‌స్పెక్టర్, జీఆర్‌పీ, విశాఖపట్నం

వేలిముద్రలతో చిక్కారిలా..



- ఒడిశాకు చెందిన ఓ యువకుడు రైలు ఎక్కి పలాస రైల్వేస్టేషన్‌లో దిగి ఇక్కడ జంట పట్టణాలలో చొరబడి అనేక దొంగతనాలకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో పలాస జీఆర్‌పీ పోలీసులకు తారసపడగా ప్రశ్నించారు. అనుమానం కలగడంతో ఒక్క సారి వేలిముద్రలు పరిశీలించగా ఒడిశాకు చెందిన పాతదొంగగా గుర్తించి వెంటనే రిమాండ్‌కు తరలించారు.
- ఒడిశాకు చెందిన మరో యువకుడు పలాస చేరుకుని సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్నాడు. సీసీ ఫుటేజీల ఆధారంగా కదలికలను గమనించిన ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ పోలీసులు అనుమానితుని వేలిముద్రలు గమనించగా సెల్‌ఫోన్ దొంగగా గుర్తించి రెండు సెల్‌ఫోన్లను రికవరీ చేశారు.



ఫింగర్ ప్రింట్‌ల సేకరణ ఇలా

- బొమ్మలు అమ్ముకునే భార్యాభర్తలు ఇటీవల పలాస మొగిలిపాడులో పట్టుబడ్డారు. ఇద్దరూ పొలంలో గుడారాలు వేసుకుని పరిసర ప్రాంతాల్లో బొమ్మలు అమ్ముతూ రాత్రి వేలల్లో దొంగతనాలకు పాల్పడుతుండేవారు. నైట్ బీట్‌లో ఉన్న పోలీసులు వీరి వేలిముద్రలు సేకరించగా నెల్లూరు జిల్లాకు చెందిన కావలి ప్రాంత పాతనేరస్తులుగా గుర్తించారు. అక్కడ పోలీసు స్టేషన్‌కు సమాచారం అందించి తిరిగి వెళ్లేసరికి గుడారాలు ఖాళీ చేసేశారు.

'అవ్యక్త' అదరహో..



పట్టీసపు అవ్యక్త

శ్రీకాకుళం న్యూకాలనీ: జాతీయ స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు జిల్లాకు చెందిన యువ క్రీడాకారిణి పట్టీసపు అవ్యక్త ఎంపికైందని ఆంధ్రప్రదేశ్ బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి పీవీజీ కృష్ణంరాజు తెలిపారు. ప్రతిష్ఠాత్మకమైన ఈ పోటీలు మహారాష్ట్రలో ఈ నెల 30 నుంచి ఏప్రిల్ 3 వరకు జరగనున్నాయని పేర్కొన్నారు. జూనియర్స్ నేషనల్ మీట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలికల జట్టు తరపున అవ్యక్త ప్రాతినిధ్యం వహించనుందని తెలిపారు. కావలిలో జరిగిన స్టేట్ మీట్‌లో అత్యుత్తమ ఆటతీరుతో రాణించడంతో జాతీయ పోటీలకు ఎంపికై నట్టు పేర్కొన్నారు. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని రాజాం మండలం శ్యాంపాలెంలోని బ్రాహ్మణ అగ్రహారానికి చెందిన అవ్యక్త ఇప్పటికే రెండుసార్లు జాతీయస్థాయి పోటీల్లో రజత, కాంస్య పతకాలు సాధించింది. తల్లిదండ్రులు అజయ్‌కుమార్, స్వప్నకుమారి, కోచ్ మధుసూదన్ ప్రోత్సాహంతో ముందడుగు వేస్తోంది. ప్రస్తుతం రాజాం జీఎంఆర్ ఐటీలో ఇంజనీరింగ్ చదువుతోంది. ఈమె ఎంపిక పట్ల శ్రీకాకుళం జిల్లా బాల్ బ్యాడ్మింటన్ సహాయ కార్యదర్శి, శిక్షకులు ఎం.మధుసూదనరావు, కోడి మోహన్, సంఘ ప్రతినిధులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

28న కొత్త పాలకమండలి ప్రమాణ స్వీకారం



అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయానికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన పాలక మండలి (ట్రస్ట్ బోర్డు) సభ్యుల ప్రమాణ స్వీకారం ఈ నెల 28న ఉదయం 10 గంటలకు ఇంద్రపుష్కరిణి వద్ద వైజయంతి ఉత్సవ వేదికపై జరుగుతుందని జిల్లా దేవదాయ శాఖాధికారి వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గత నెల 8న పాలకమండలిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎం.జవహర్ రెడ్డి జీఓ 115 పేరిట ఉత్తర్వులు జారీ చేశారని, అయితే ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న కారణంగా జాప్యం జరిగిందని వివరించారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు సమక్షంలో జరుగనున్న ఈ ప్రమాణ స్వీకారానికి ట్రస్ట్ బోర్డు చైర్మన్‌గా ఆలయ వ్యవస్థాపక సభ్యుడు ఇప్పిలి జోగిసన్యాసిరావు, ఎక్స్ అఫీషియో సభ్యుడుగా ఇప్పిలి శంకరశర్మలతో పాటు మండవల్లి రవి, డాక్టర్ కొంచాడ సోమేశ్వరరావు, ద్వారపు అనూరాధ, నెమలిపురి కోటేశ్వరరావు చౌదరి, దుక్క గన్నిరాజు, లుకలాపు గోవిందరావు, జలగడుగుల శ్రీనివాస్, మైలపల్లి లక్ష్మి, వాభ లోకేశ్వరి, జోగి మల్లెమ్మ తదితర 12 మంది సభ్యులు హాజరుకావాలని కోరారు.

క్లుప్తంగా

ముంచెత్తిన వాన

- వేణుగోపాలస్వామి గర్భగుడిలోకి వరదనీరు



వేణుగోపాలస్వామి ఆలయ గర్భగుడిలోకి చేరిన వరదనీరు

కవిటి: మండల కేంద్రం కవిటిలో బుధవారం భారీ వర్షం కురిసింది. దీంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. బస్టాండ్ సమీపంలోని వేణుగోపాలస్వామి ఆలయం గర్భగుడి లోకి వరద నీరు చేరింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ పూడి లక్ష్మణరావు చేరుకొని వరదను పరిశీలించారు. పంచాయతీ యంత్రాంగాన్ని రంగంలోకి దింపారు. మోటారు సాయంతో గుడిలో చేరిన వరదనీటిని తొలగించారు.

ఆరోగ్యభారత్ స్థాపనలో భాగస్వామ్యం కావాలి



ఇందిరాప్రసాద్‌ను సన్మానిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం అర్బన్: ఆరోగ్య భారత్ స్థాపనలో అందరూ భాగస్వామ్యం కావాలని, తద్వారా ఆరోగ్య సమాజ స్థాపన సాధ్యపడతుందని జిల్లా వ్యవసాయశాఖ విశ్రాంత జాయింట్ డైరెక్టర్ కూన వేణుగోపాల్ అన్నారు. ఉగాది సందర్భంగా శ్రీకాకుళం ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రముఖ సామాజికవేత్త, స్టార్ వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు జి.ఇందిరాప్రసాద్‌ను బుధవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిస్వార్థ సేవకుడుగా పేరు తెచ్చుకున్న ఇందిరాప్రసాద్ వాకర్స్‌కు ఆరోగ్య ప్రదాతగా నిలిచారని కొనియాడారు. సన్మాన గ్రహీత మాట్లాడుతూ.. వాకర్స్ అంతా మానవతా దృక్పథం అలవర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో వాకర్స్ ప్రతినిధులు ఎస్.జోగినాయుడు, ఎన్.ఈశ్వరరావు, కె.భాస్కరరావు, బెండి శివప్రసాద్ బి.దేవీప్రసాద్, గోలీ సంతోష్, గోలీ ఉమామహేశ్వరరావు, ఎం.మల్లిబాబు, ఎస్.కామేశ్వరరావు, గుడ్ల జగ్గారావు, డాక్టర్ జి.నారాయణరావు పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థినికి ఆర్థిక సాయం



విద్యార్థిని తండ్రికి చెక్కు అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జేసీఐ గ్రీన్‌సిటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థిని ఎం.యశస్వినికి ఫీజు నిమిత్తం రూ.61 వేలు సాయం ఆమె తండ్రికి అందించారు. స్థానిక బాపూజీ కళామందిర్‌లో బుధవారం జరిగిన కార్యక్రమంలో గ్రీన్‌సిటీ అధ్యక్షులు మణిశర్మ చేతుల మీదుగా ఈ మొత్తాన్ని అందించారు. ఈ మొత్తంలో వ్యవసాయశాఖ నుంచి రూ.25 వేలు, శాస్త్రి రూ.10 వేలు, న్యూసెంట్రల్ స్కూల్ రూ.5 వేలు, దిలీప్ రూ.5 వేలు, ఉషా రూ.5వేలు సమకూర్చారు. కార్యక్రమంలో హారికాప్రసాద్, గుడ్ల మల్లేశ్వరరావు, వెంకటలక్ష్మి, వనిత, జాడ సాయి పాల్గొన్నారు.

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	56,150-00
బంగారం(22సి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు (100 గుడ్లు)	
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹120	₹195	₹ 215

సేంద్రియ సాగు..భలేబాగు



మోహనరావు సాగు చేస్తున్న సారికంద



సొరకాయ సాగు

- కూరగాయలు, పండ్ల తోటల పెంపకం
- ఆదర్శకంగా నిలుస్తున్న పద్మాపురం రైతు మోహనరావు

సారవకోట: పంటల సాగులో రైతులు వివిధ పద్ధతులు పాటిస్తుంటారు. కొంతమంది పాత విధానాలనే కొనసాగిస్తూ పంటలను పండిస్తే..మరికొందరు మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త ఆలోచనలతో ముందుకు వెళ్తుంటారు. సారవకోట మండలం పద్మాపురం గ్రామానికి చెందిన రైతు రావాడ మోహనరావు కూడా కొత్తగా ఆలోచన చేశారు. సేంద్రియ పద్ధతును అవలంబిస్తూ తన కున్న 23 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేస్తూ మెరుగైన దిగుబడులు సాధిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. కిడిమి గ్రామానికి సమీపంలో కొండలకు సమీపంలో ఉన్న తన భూమిని సాగుకు పనికి వచ్చేలా మార్పుచేసి సేంద్రియ పద్ధతులతో వ్యవసాయం చేస్తున్నాడు. దీంట్లో ముఖ్యంగా కూరగాయలు, పండ్ల తోటలను వేశారు. రసాయనిక ఎరువుల వాడకంతో అటు నేలతల్లికి మేలు చేస్తున్నాడు. అలాగే మానవుల ఆరోగ్యానికి ఇబ్బంది లేకుండా ప్రకృతి వ్యవసాయాన్ని ఎంచుకున్నాడు. సేంద్రియ పద్ధతులైన ఘన, ద్రవ జీవామృతాలు, నీమాస్త్రం, అగ్ని హస్త్రాలను ఉపయోగించి సారకాయలు, వంకాయలు, దొండ, బీర, సారికంద, మిరప, చిక్కుడు, బీన్స్, తోటకూర, క్యారెట్, ముల్లంగి తదితర పంటలను సాగు చేస్తున్నాడు. సేంద్రియ పద్ధతులైన ఘన, ద్రవ జీవాస్త్రాల తయారీకి నాటు ఆవులు ఉండాల్సి రావడంతో వాటిని, కోళ్లను పెంచుతున్నారు. ఆవు పేడ, మూత్రాన్ని వినియోగించి తయారు చేసిన ఎరువులతో పంటలను సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంటలన్నీ కాపు దశలో ఉన్నాయి. ఈ పద్ధతిలో పంటల సాగులో మరింత మెలకువలు తెలుసుకుని దిగుబడిని పెంచేందుకు కృషి చేస్తున్నారు. అలాగే మరో 60 సెంట్లలో ప్రత్యేకించి అంతర పంటలుగా ఒకే చోట ఏడు రకాల కూరగాయలైన సారకాయలు, దొండ, తోటకూర, క్యారెట్, కాకర, బీర, ముల్లంగి పంటలు పండిస్తున్నారు. ఇవేకాక కూరగాయలు పండిస్తున్న పంట పొలాల చుట్టు ఖాళీ ప్రదేశాలలో 600 కొబ్బరి మొక్కలు, మామిడి, సపోట, నిమ్మ, దానిమ్మ, బొప్పాయి పంటలను పండిస్తూ వాటికి సేంద్రియ ఎరువులు వాడుతున్నారు. తనకున్న ఖాళీ భూమిలో నాలుగు బోర్లు వేసి మూడింటికి విద్యుత్, ఒకటి సోలార్ పద్ధతిలో నడిచేటట్లు ఏర్పాటు చేసి స్ప్రింకలింగ్ విధానంలో నీరు వృథా కాకుండా చూసేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆరోగ్యకరమైన కూరలు అందించాలని..



ప్రస్తుత రోజుల్లో ఎవరికీ పెద్దగా తిండికి లోటు లేదు. కానీ సరైన.. ఆరోగ్యకరమైన ఆహారం తినాలని ఉన్నా సాధ్యం కావడం లేదు. రసాయనిక ఎరువుల వాడకంతో సాగుచేస్తున్న పంటల కారణంగా ఆస్థాయి తిండి తినలేక పోతున్నారు. ఆరోగ్యకరమైన ఆహారం కోసం ఎదురు చూస్తున్నందున వారికి మంచి కూరలు అందించాలని.. పలువురికి ఆదర్శంగా నిలవాలని సేంద్రియ పంటల సాగు పద్ధతిని ఎంచుకున్నాను. దీనికి ఆర్‌బీకే, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది సలహాలు, సూచనలు పాటిస్తున్నా.

రావాడ మోహనరావు, రైతు, పద్మాపురం

నేలతల్లిని కాపాడాలి



ప్రస్తుతం రసాయనిక ఎరువులు వాడకం ఎక్కువైంది. దీంతో నేలతల్లికి తీవ్ర నష్టం వాటిల్లుతుంది. నేలతల్లిని కాపాడాల్సిన బాధ్యత అందిరిపై ఉంది. సేంద్రియ పద్ధతిలో సాగు చేయడం భూసారం పెరుగుతుంది. సేంద్రియ ఎరువులతో సాగుచేసే పంటలను తినడం వలన ఆరోగ్యాలకు నష్టం ఉండదు.

రావాడ అప్పలనాయుడు, రైతు, పద్మాపురం

దిగుబడి ప్రారంభమైంది



రైతు మోహనరావు సేంద్రియ పద్ధతిలో వివిధ పంటలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం దిగుబడి ప్రారంభమైంది. మరింత దృష్టి సారించి అన్ని రకాల పంటల దిగుబడి పెంచి మార్కెట్లో విక్రయించేందుకు ప్రయత్నిస్తున్నాం.

ముద్దాడ సింహాచలం, రైతు, పద్మాపురం

తరచూ పరిశీలిస్తున్నాం



రైతు రావాడ మోహనరావు సేంద్రియ పద్ధతిలో అధిక విస్తీర్ణంలో కూరగాయలు, పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. రెండ్రోజులకొకసారి ఆర్‌బీకే, ప్రకృతి వ్యవసాయ సిబ్బందితో పాటు తాను హాజరై కషాయాల తయారీ, వాటి వాడకంపై అవగాహన కల్పిస్తున్నాం. మోహనరావును ఆదర్శంగా తీసుకుని రైతులు సేంద్రియ వ్యవసాయ పద్ధతులపై దృష్టిసారించాలి.

కేసీహెచ్ వెంకటరావు, వ్యవసాయాధికారి, సారవకోట

కల్యాణ మహోత్సవానికి వేళాయె..

- 28 నుంచి ఆదిత్యుని వార్షిక కల్యాణ మహోత్సవాలు
- వచ్చే నెల 1న కల్యాణం, 5న పుష్పయాగం



కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్, ఈవో, ప్రధానార్చకులు

అరసవల్లి: ఆరోగ్య ప్రదాత, ప్రత్యక్షదైవం సూర్యనారాయణ స్వామి వారి వార్షిక కల్యాణ మహోత్సవానికి వేళయ్యింది. ఈనెల 28వ తేదీ చైత్రశుద్ధ సప్తమి నుంచి వచ్చే నెల ఐదో తేదీ చతుర్ధశి వరకు స్వామి వారి ఆలయ అనివెట్టి మండపంలో జరగనున్న కల్యాణోత్సవాలకు ఏర్పాట్లు శరవేగంగా సాగుతున్నాయి. ఇందులో భాగంగా బుధవారం ఉదయం జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఆర్డీవో శాంతి, ఆలయ ఈవో వి.హరిసూర్యప్రకాష్, ప్రధానార్చకులు ఇప్పిలి శంకరశర్మ తదితరులు వార్షిక కల్యాణ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. కల్యాణ మహోత్సవాలను గతంలో కంటే ఘనంగా నిర్వహించాలని, ఏర్పాట్లలో భాగంగా వివిధ శాఖలను సమన్వయం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో బి.శాంతి, పాలకమండలి సభ్యులు మండవల్లి రవి, ఎస్.కె.చౌదరి పాల్గొన్నారు.

కల్యాణ ఘట్టాలివే..

- కల్యాణోత్సవాల్లో తొలి ఘట్టంగా ఈనెల 28వతేదీ సాయంత్రం ఆరు గంటలకు కల్యాణాంగ ధ్వజారోహణం, పతాకావిష్కరణ
- 31 సాయంత్రం ఏడు గంటలకు సుగంధద్రవ్య మర్ధన (కొట్నం దంపు)
- ఏప్రిల్ 1న ఏకాదశి ముహూర్తాన రాత్రి 7 గంటల నుంచి కల్యాణ మహోత్సవం
- 2న ఆగ్నేయ స్థాలీపాక హోమాదులు
- 3న వేద పండిత సదస్సు, సత్కారాలు, రథోత్సవం
- 4న తిరుమంగయాళ్వారుల చరిత్ర, సంవాద విన్నపాల ఘట్టం
- 5న ఉదయం 8 గంటలకు సుమంగళి అర్చన, అనంతరం ధ్వజావరోహణం, సాయంత్రం 7 గంటలకు పుష్పయాగ మహోత్సవంతో కల్యాణోత్సవాలు ముగియనున్నాయి.

ఆలయంలోనే టిక్కెట్ల విక్రయాలు

వచ్చే నెల ఒకటో తేదీన జరగనున్న ఆదిత్యుని వార్షిక కల్యాణోత్సవానికి సంబంధించి కల్యాణ టిక్కెట్లు రూ.500 (ఇద్దరు/ దంపతులకు అనుమతి), ప్రత్యేక టిక్కెట్లను ఆలయంలోనే విక్రయించనున్నామని ఈవో వి.హరిసూర్యప్రకాష్ తెలిపారు. అలాగే వార్షిక కల్యాణ సేవకు గతంలో నగదు చెల్లించిన వారు నేరుగా రశీదులతో పాటు కల్యాణ సేవలో పాల్గొనే అవకాశం ఉంటుందని వివరించారు. సేవకు హాజరైన వారికి స్వామి వారి శేష వస్త్రాలను అందజేస్తామని, దూరాన ఉన్న వారికి తలంబ్రాలు, శేషవస్త్రాలను పోస్టల్‌లో పంపిస్తామని వివరించారు.

పెంట గ్రామానికి చెందిన నలుగురికి రైల్వే ఉద్యోగాలు

జి.సిగడాం: పెంట గ్రామానికి చెందిన నలుగురు యువకులు రైల్వేశాఖలో ఉద్యోగాలు సాధించారు. పాగిరి సునీల్‌కుమార్, ఎర్నేన సంతోష్‌కుమార్, పాగిరి వెంకటరమణ, మక్క రమేష్ ఉద్యోగాలు సాధించిన వారిలో ఉన్నారు. వీరిలో వెంకటరమణ అసిస్టెంట్ పాయింట్‌మెన్, మిగతా ముగ్గురు ట్రాక్ మెన్లుగా ఎంపికయ్యారు. గత ఏడాది ఆగస్టు నెలలో నిర్వహించిన పోటీ పరీక్షలను వీరు రాసి అర్హత సాధించారు. వీరికి చెన్నైలో మెడికల్ పరీక్షలు కూడా పూర్తయ్యాయి. బుధవారం జాయినింగ్ ఉత్తర్వులు అందాయి. గ్రామానికి చెందిన నలుగురు యువకులు ఒకేసారి రైల్వేశాఖలో ఉద్యోగాలు సాధించడంపై సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, ఉద్యోగ సంఘం అధ్యక్షుడు గార విశ్వేశ్వరరావు, సరస్వతి గ్రంథాలయ చైర్మన్ మక్క పెద్దప్పలనాయుడు, నీటిపారుదల శాఖ అధికారి అలుగోలు మహేశ్వరరావు, ఆర్అండ్‌బీ అధికారి సింహాద్రి ప్రదీప్‌కుమార్ (బుజ్జి), జిల్లా ఏపీటీఎఫ్ మహిళా అధ్యక్షురాలు మక్క గంగేశ్వరీ హర్షం వ్యక్తం చేశారు.

సాగునీటి వనరుల మంజూరుకు చర్యలు తీసుకోండి

- ఏపీఎస్ఐడీసీ అధికారులకు మంత్రి సీదిరి ఆదేశం



మంత్రి అప్పలరాజుతో చర్చిస్తున్న అధికారులు

కాశీబుగ్గ: సాగునీటి వనరులు సకాలంలో మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఐడీసీ) అధికారులను మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుతో ఆదేశించారు. పలాస నియోజకవర్గంలో మహేంద్ర తనయనది, బెండి గెడ్డల ద్వారా వివిధ ప్రాంతాలకు సాగునీరు అందించేందుకు నిర్మించతలపెట్టిన నీటి పథకాలపై పలాసలోని క్యాంప్ కార్యాలయంలో మంత్రిని కలిసిన అధికారులు చర్చించారు. పాత్తంగి-2 ఎత్తిపోతల పథకం ద్వారా 430 ఎకరాలు, మందస మండలం కొత్తపల్లి ఎత్తిపోతల పథకం ద్వారా 630, మందస మండలం పింపిడియాలో 440, బెండి ఎత్తిపోతల పథకం ద్వారా 530 ఎకరాలు, వజ్రపుకొత్తూరు మండలానికి కూడా సాగు నీరు అందించేలా ప్రతిపాదనలు, నీటి అనుమతులు తయారీపై సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ.. నీటి అనుమతులు త్వరితగతిన మంజూరయ్యేందుకు కావలసిన అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఏపీఎస్ఐడీసీ ఈఈ కె.వి.వి సుబ్రహ్మణ్యం, డీఈఈ పి.పి.ప్రసాదరావు, ఏఈ కామరాజు పాల్గొన్నారు.

మే 21 నుంచి నీలమణిదుర్గ అమ్మవారి ఉత్సవాలు



పాతపట్నం: పండుగ తేదీల పత్రికను మధుబాబుకు అందజేస్తున్న నాగభూషణశర్మ

పాతపట్నం: పాతపట్నం గ్రామ దేవత నీలమణి దుర్గ దేవి అమ్మవారి ఉత్సవాలు మే నెల 21 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించడానికి గ్రామ పెద్దలు నిర్ణయించారు. జూబ్లీ హిల్స్ రోడ్డులో ఉన్న జగన్నాథ ఆలయంలో గ్రామ పెద్దల సమక్షంలో పురోహితులు వెంకటనాగభూషణ శర్మ ఆధ్వర్యంలో బుధవారం నిర్ణయించారు. 21న ఉజ్జిడి పండుగతో ప్రారంభమై 30వ తేదీ వరకు తొమ్మిది రోజుల పాటు పండుగలు జరుగుతాయన్నారు. గ్రామ పెద్దల సమక్షంలో కమిటీలు వేసేందుకు నిర్ణయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు లింగాల వెంకటమధు, ఉషారాణి, సవిరిగాన ప్రదీప్, పైల లక్ష్మయ్య, నూలు ఈశ్వరరావు, శిర్ల జోగారావు, పైల బాబ్జి, నూలు బుజ్జి, ఎరకయ్య, ఎస్.మధుబాబు, మల్లికార్జునరావు పాల్గొన్నారు. కాగా ఏడేళ్లకొకసారి అమ్మవారి పండుగను వైభవంగా జరపడం ఆనవాయితీ. అయితే రెండేళ్ల కరోనా కారణంగా ఈసారి తొమ్మిదేళ్ల తరువాత ఉత్సవాన్ని జరపనున్నారు.

శ్రీరామనవమి పందిరి రాటపై వివాదం

- పోలీసుల రాకతో సద్దుమణిగిన వైనం



సర్పంచ్‌తో మాట్లాడుతున్న సీఐ ఆదాం, ఎస్సై రాజేష్‌లు

రణస్థలం: కోష్ట గ్రామంలోని కోదండరామాలయంలో శ్రీరామనవమి వేడుకల సందర్భంగా వేయాల్సిన పందిరి రాట ఇరువర్గాల మధ్య వివాదానికి కారణమైంది. అయితే పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో పరిస్థితి సద్దుమణిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోష్ట గ్రామంలో గ్రామస్తులందరూ కలిపి విరాళాలతో నిర్మించుకున్న రామాలయంలో నవమి వేడుకలు నాలుగేళ్లుగా టీడీపీ నాయకుడు పిషిణి జగన్నాథం చేస్తున్నారు. గత ఏడాది వైఎస్సార్‌సీపీకి చెందిన పిషిణి హరిబాబు (చిన్నంనాయుడు) సర్పంచ్‌గా గెలిపొంది పంచాయతీ ప్రథమ పౌరుడు హక్కుతో గ్రామస్తులందరి ఆమోదంతో వేడుకలు చేశారు. ఈ క్రమంలోనే ఈ ఏడాది శ్రీరామనవమి వేడుకలు చేసేందుకు ఇరువర్గీయులు సన్నాహకాలు చేస్తున్నారు. టీడీపీ నాయకుడు జగన్నాథం నవమి వేడుకలు ఈ ఏడాది తానే చేయాలని నిర్ణయించుకున్నానని వివాదానికి తావులేకుండా అవకాశం ఇవ్వాలని జె.ఆర్.పురం పోలీసులను ఆశ్రయించారు. పోలీసులు ఇరువర్గాలను మంగళవారం పిలిచి ఒక్కొక్క వర్గం నుంచి పదిమంది చొప్పున కలిసి పందిరి రాట వేసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. దీంతో బుధవారం ఉదయాన్నే ప్రస్తుత సర్పంచ్ హరిబాబు వర్గీయులు రామాలయం వద్ద ముహూర్తం ప్రకారం పందిరి రాట వేశారు. తాము రాకుండా రాట వేశారని ఆరోపిస్తూ టీడీపీ వర్గీయులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న జె.ఆర్.పురం సీఐ ఎస్ ఆదాం, ఎస్సై జి.రాజేష్ చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడి పరిస్థితి చక్కదిద్దే ప్రయత్నం చేశారు. ఏపీ సాధుపరిషత్ అధ్యక్షుడు శ్రీనివాసనంద స్వామి సంఘటన స్థలానికి రావడంతో శాంతిభద్రతలు అదుపుతప్పకుండా జె.ఆర్.పురం సర్కిల్ పరిధిలోని నాలుగు మండలాల ఎస్సైలు, పోలీస్ సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. గంట పాటు హైడ్రామ నడిచిన తరువాత ఇరువర్గాలను పోలీసులు నచ్చజెప్పి పంపించేయడంతో వివాదం సద్దుమణిగింది.

గ్రానైట్ కార్మికుడు మృతి



దిలీప్‌సంఘా మృతదేహం

కోటబొమ్మాళి: జర్జంగి గ్రామంలోని గోవిందా రాక్స్ గ్రానైట్ కటింగ్ పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్న అసోం రాష్ట్రం ఉదల్‌గురి జిల్లా పాకిద్యా గ్రామానికి చెందిన దిలీప్‌సింఘా (43) బుధవారం వేకువజామున ఆకస్మికంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మంగళవారం సాయంత్రం పరిశ్రమలో పనిముగించుకుని రాత్రి దిలీప్‌సింఘా తోటి కార్మికులతో సహా పరిశ్రమలోనే నిద్రపోయాడు. బుధవారం ఉదయం తోటి కార్మికుడు సుభాజిత్ నాగర్.. దిలీప్‌సింఘాను నిద్రలేపగా లేవలేదు. దీంతో వెంటనే కోటబొమ్మాళి ప్రభుత్వాస్పత్రికి చికిత్స నిమిత్తం తీసుకురాగా అప్పటికే దిలీప్‌సింఘా మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. గుండె నొప్పితో మృతిచెంది ఉండవచ్చునని పోలీసులు భావిస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై షేక్ మహమ్మద్ అలి తెలిపారు.

గెస్ట్ హౌస్‌లో చోరీ

- రూ. 2 లక్షల అపహరణ



వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ మహేంద్ర, క్లూస్ టీమ్ సిబ్బంది

లావేరు: వెంకటాపురం గ్రామంలో చోరీ జరిగింది. మాజీ సర్పంచ్ శంబాన సూర్యనారాయణ వ్యవసాయ పొలంలోని గెస్టుహౌస్‌లో మంగళవారం రాత్రి దొంగలుపడి రూ. 2 లక్షల నగదు, టీవీ అపహరణకు గురైనట్టు ఫిర్యాదు అందిందని లావేరు ఎస్సై ఎ.కోటేశ్వరరావు బుధవారం తెలిపారు. సూర్యనారాయణకు అదే గ్రామంలో వ్యవసాయ భూమి, కొబ్బరి తోటలో గెస్టు హౌస్ ఉంది. మంగళవారం సాయంత్రం వరకూ గెస్టుహౌస్ వద్దనే ఉన్న ఆయన రాత్రి సమయంలో తాళాలు వేసి ఇంటికి వెళ్లిపోయారు. బుధవారం ఉదయం వెళ్లి చూడగా గెస్ట్ హౌస్ తలుపు తాళాలు విరగొట్టి ఉండడంతో అనుమానంతో లోపలికి వెళ్లి చూడగా మంచం పరుపు కింద ఉంచిన రూ.2 లక్షల నగదు, టీవీ కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్టు గుర్తించిన ఆయన పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్సై కోటేశ్వరరావు సంఘటనా స్థలాన్ని పరిశీలించడంతోపాటు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శ్రీకాకుళం డీఎస్పీ ఎం.మహేంద్ర, జేఆర్ పురం సీఐ ఆదాం కూడా గెస్ట్ హౌస్‌ను పరిశీలించారు. క్లూస్ టీమ్ వివరాలు సేకరించారు. సూర్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులకు అభినందన




క్రీడాకారులను అభినందిస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్

శ్రీకాకుళం న్యూకాలనీ: క్రీడలతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్ సాధ్యమని జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్ అన్నారు. నెల్లూరు జిల్లా కావలి డీబీఎస్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 17 నుంచి 19వ తేదీన వరకు జరిగిన ఏడో ఏపీ రాష్ట్ర స్థాయి జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు తృతీయస్థానంలో నిలిచి కాంస్య పతకాలు, ట్రోఫీ సాధించింది. జిల్లాకు చేరుకున్న క్రీడాకారులు బుధవారం కలెక్టర్‌ను కలిసి అభినందనలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడాకారులకు విశ్వవ్యాప్తంగా గుర్తింపు, గౌరవం లభిస్తోందన్నారు. కార్యక్రమంలో శ్రీకాకుళం బాల్ బ్యాడ్మింటన్ సంఘం సహాయ కార్యదర్శి, శిక్షకుడు ఎం.మధుసూదనరావు, స్టార్ వాకర్స్ క్లబ్ అధ్యక్షులు శాసపు జోగినాయుడు, అబ్దుల్ కలామ్ ఐడియాలజీ మిషన్(ఎయిమ్) యూత్ క్లబ్ ఉపాధ్యక్షుడు రుప్ప నరసింహానాయుడు ఉన్నారు.

శస్త్రచికిత్స చేసి..ప్రాణం పోసి..


- గేదెకు అత్యవసర చికిత్స చేసిన వైద్యుడు



గేదెకు ఆపరేషన్ చేస్తున్న డాక్టర్ కిరణ్‌కుమార్

కోటబొమ్మాళి: కడుపులో దూడ చనిపోవడంతో ఇబ్బంది పడుతున్న గేదెకు శస్త్రచికిత్స చేసి..బయటకు తీసి ప్రాణభిక్ష పెట్టారు పశు వైద్యుడు. వివరాల్లోకి వెళితే.. సంతబొమ్మాళి మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన రైతు కర్రి రమణయ్యకు చెందిన చూడి గేదె వారం రోజులుగా అనారోగ్యంతో బాధపడుతోంది. మంగళవారం అర్ధరాత్రి కడుపునొప్పితో అవస్థలు పడటాన్ని గమనించిన రైతు విషయాన్ని కురుడు పశువైద్య కేంద్రం డాక్టర్ లఖినేని కిరణ్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లారు. ఆయన బుధవారం వేకువజామున గ్రామానికి చేరుకున్నారు. గేదె ఆరోగ్య పరిస్థితిని పరీక్షించి దూడ కడుపులో చనిపోయినట్టు గుర్తించారు. వెంటనే మూడు గంటలపాటు ఆపరేషన్ చేసి చనిపోయిన దూడను బయటకు తీశారు. దీంతో గేదెకు ప్రాణాపాయం తప్పింది. ఉగాది పండుగ రోజున కూడా వృత్తిధర్మాన్ని తప్పకుండా వేకవజామునే వచ్చి..ఆపరేషన్ చేసి గేదె ప్రాణాన్ని నిలిపిన పశువైద్యుడు కిరణ్‌కుమార్‌కు రైతు రమణయ్య కృతజ్ఞతలు తెలియజేయగా.. గ్రామస్తులు అభినందించారు.

పేదలకు చీరలు పంపిణీ



చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): శోభకృత్ నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకుని పలువురు నిరుపేద విశ్వబ్రాహ్మణ మహిళలకు విశ్వబ్రాహ్మణ ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అనుమంచిపల్లి వేణుగోపాలచారి, ప్రధాన కార్యదర్శి కానూరి నారాయణరావు సమక్షంలో బుధవారం చీరలు పంపిణీ చేశారు. శ్రీకాకుళం నగరంతో పాటు పలు మండలాల్లో పంపిణీ ప్రక్రియ చేపట్టారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు మాట్లాడుతూ.. నిరుపేద విశ్వబ్రాహ్మణ మహిళలను ఆదుకోవడమే తమ సంఘ లక్ష్యమన్నారు. ఉగాది రోజున ఇటువంటి సేవా కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు కుప్పిలి కళావతి, శృంగవరపు సూర్యకుమారి, సుగంధం సంజీవరావు, అనుపోజు బాబూరావు పాల్గొన్నారు.